హైదరాబాద్
6-10-2023
సంపుటి:08
సంచిక: 361
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
# సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole



## ముడుపులకు సాక్ష్యాలున్నాయా?

- సిసోడియాకు వ్యతిరేకంగా ఆధారాలేవి?
- దినేశ్ అరోరా కూడా కేసులో నిందితుడేగా?
- అతని వాంగ్మూలం కాక ఇతర సాక్ష్యం ఉందా?
- ఢిల్లీ మద్యం కేసులో సుప్రీంకోర్టు ప్రశ్నలు
- మనీశ్ బెయిలుపై విచారణ 12కు వాయిదా
- క్రాస్ఎగ్జామినేషన్‌లో 2 నిమిషాల్లో వీగిపోయే కేసని వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో దర్యాప్తు సంస్థలకు సుప్రీంకోర్టు పలు కీలక ప్రశ్నలు సంధించింది. కేసు తీవ్రతపైనా సందేహాలు వ్యక్తం చేసింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో మనీలాండరింగ్, అవినీతి ఆరోపణలపై అరెస్టయిన ఆప్ నేత మనీశ్ సిసోడియా బెయిలు పిటిషన్ విచారణ సందర్భంగా

2లో

## ప్రలోభాలపై పక్కా నిఘా


- స్వేచ్ఛాయుత వాతావరణంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తాం: సీఈసీ రాజీవ్‌కుమార్
- రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, అంబులెన్సులు, ప్రభుత్వ వాహనాలు, ప్రైవేటు విమానాల్లో సైతం తనిఖీలు
- కుక్కర్లు, చీరలు, సరుకుల గోదాములపై కన్ను.. నగదు ఆన్‌లైన్ లావాదేవీలపైనా దృష్టి
- ధనం, మద్యం, మాదక ద్రవ్యాలు, కానుకల ప్రవాహంపై ఉక్కుపాదం..
- రాష్ట్ర సరిహద్దులు, 148 చెక్ పోస్టులపై సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ
- రాష్ట్రంలో ముగిసిన ఈసీ మూడురోజుల పర్యటన
- ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లంతా భాగస్వాములు కావాలని పిలుపు



హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ఎలాంటి ప్రలో భాలకు తావులేకుండా నిర్వహించడానికి కట్టుబడి ఉన్నామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ స్పష్టం చేశారు. అన్ని రకాల ప్రలోభాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని ప్రకటించారు. ఎన్నికల్లో ధనం, మద్యం, ఇతర కానుకలు, మాదకద్రవ్యాల ప్రవాహాన్ని పూర్తిగా

2లో

## నార్వే రచయిత జాన్ ఫోసెకు సాహిత్య నోబెల్



స్టాక్‌హోం, అక్టోబరు 5: నార్వే రచయిత జాన్ ఒలావ్ ఫోసె 2023 సంవత్సరానికిగాను నోబెల్ సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. నోరువిప్పి చెప్పలేని ఎన్నో అంశాలకు గొంతుగా

2లో

## రోడ్లు వేయలేని నువ్వొక సీఎంవా!

- జగన్‌పై పవన్ మండిపాటు
- ఇంటర్ సర్టిఫికెట్లు ఇవ్వడానికీ డబ్బు లేదా?
- కొల్లేరు కాంటూరు అంటే ఏమిటో తెలుసా?
- నువ్వు నొక్కని బటన్లు ఎన్నో
- అధికారంలోకి వచ్చిన నెలలోపు
- మద్యనిషేధం చేస్తానని అబద్ధాలు చెప్పను


## ఇక అమీతుమీయే!

- 34 సీట్లు ఇవ్వకపోతే ప్రత్యక్ష కార్యాచరణ
- నగర శివార్లలో సమావేశమైన కాంగ్రెస్ బీసీ నేతలు
- మరోసారి ఢిల్లీ వెళ్లాలని నిర్ణయం!

హైదరాబాద్: కాంగ్రెస్‌లో టికెట్ల వ్యవహారం చిచ్చురేపుతోంది. బీసీలకు 34 సీట్లు ఇస్తామని రాజకీయ వ్యవహారాల కమిటీలో ఇచ్చిన హామీ మేరకు టికెట్లు కేటాయించకపోతే ప్రత్యక్ష కార్యా చరణకు సిద్ధం కావాలని

మిగతా 2లో





### సమ ఉజ్జీలతోనే మా పోటీ..

# మరుగుజ్జులతో కాదు

## కేసీఆర్ ముందు రేవంత్, కిషన్ కుప్పిగంతులు



- గెలిచిన సీట్లతో రేవంత్ రెడ్డి బీజేపీలో చేరతాడు
- తీగలు పట్టుకోండి.. కరెంట్ ఉందో లేదో తెలుస్తుంది
- హైదరాబాద్‌లో మరో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- 24 గంటల నీటి సరఫరా నా కల.. నెరవేరుస్తాం
- కాంగ్రెస్‌వి దింపుడు కల్లం గ్యారెంటీలు: కేటీఆర్?

హైదరాబాద్: రైతుల ఆదాయం డబుల్ చేస్తానని చెప్పిన ప్రధాని మోదీ.. ఆ పని చేశారా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. రైతు ఆదాయం డబుల్ కావాలంటే నోటి మాటలు, ఊకదంపుడు ఉపన్యాసాలతో కాదని ధ్వజమెత్తారు. తెలంగాణలో తప్ప ఇతర రాష్ట్రాల్లో రైతుల కష్టాలు డబుల్ అయ్యాయని, అక్కడ రైతు బంధు, రైతు బీమా, 24 గంటల కరెంట్ ఇవ్వలేని దుస్థితి ఉందని తెలిపారు. సీఎం కేసీఆర్ దృష్టికి

మిగతా 2లో

## కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు కలిసి కుట్రలు

### 2014 నుంచే బీజేపీ, బీఆర్ఎస్ ఫెవికాల్ బంధం

- ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడమే రాష్ట్రంలో ప్రధాని పర్యటనల ఆంతర్యం
- లోక్‌సభ ఎన్నికలకూ బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ మధ్య కుదిరిన ఒప్పందం
- 2018లో కూడా ప్రగతి భవన్ వేదికగా కేసీఆర్, బీజేపీ నేతల కుట్ర
- 6 గ్యారెంటీలతో ప్రజల చూపు కాంగ్రెస్ వైపే
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ వ్యాఖ్యలు

హైదరాబాద్, తెలంగాణలో 2014 నుంచి ఇప్పటి వరకు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ఉంటూ సందర్భం వచ్చినప్పుడల్లా అంతర్గతంగా సహకరించుకుంటూ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయడానికి అవకాశవాద రాజకీయాలు చేస్తున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి విమర్శించారు. గత రెండు రోజుల నుంచి ప్రధాని మోదీ, మంత్రి కేటీఆర్ మాటలను నిశితంగా పరిశీల్పిస్త ఇదే విషయం స్పష్టమవుతుందని ఆయన అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఫెవికాల్ బంధాన్ని నిజామాబాద్ సాక్షిగా మోదీ ఒప్పుకున్నారని వ్యాఖ్యానించారు. గురువారం రేవంత్ రెడ్డి అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన జడ్పీటీసీ మంత్రినాయక్, ఉప్పునూతల జప్పీటీసీ ప్రతాప్ రెడ్డి, ఎంపీపీ అరుణ నర్సింహారెడ్డి, అచ్చంపేట వైస్ ఎంపీపీ అమరావతి సీఎం రెడ్డి, జీహెచ్ఎంసీ

2లో

# నార్వే రచయిత జాన్ ఫోసెకు సాహిత్య నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సాహిత్యం నిలబడిందని రాయల్ స్వీడిష్ అకాడమీ శ్లాఘించింది. నాటక, గద్య రచయితగా జాన్ ఫోసె ప్రసిద్ధుడు. మేలిమి అనదగ్గ గద్య కావ్యాలెన్నో ఆయన వెలువరించారు. వాటిలో 'సెప్టోలజీ'ని రెండేళ్ల క్రితం పూర్తిచేశారు. అలాగే.. 2019లో 'ద అదర్ నేమ్', 2020లో 'ఐ ఈజ్ అనదర్', 2021లో 'ద న్యూ నేమ్' గ్రంథాలు వెలువడ్డాయి. నార్వే పశ్చిమ తీర ప్రాంతంలో 1959లో ఫోసె జన్మించారు. నార్వేలో ప్రధానంగా మాట్లాడే భాషల్లో ఒకటైన 'నినోస్క్'లో (నార్త్ జర్మనిక్ మాండలికం) అనేక సాహితీ ప్రక్రియల్లో ఫోసె విస్తారంగా రచనలు చేశారు. నాటకాలు, నవలలు, కవితాసంకలనాలు, వ్యాసాలు, పిల్లల పుస్తకాలు, అనువాద మాధ్యమాల్లో 40కిపైగా పుస్తకాలు వెలువరించారు. నార్వే సాహిత్యంలో ఆయన కొత్త రచనా శైలిని ప్రవేశపెట్టారు. దానిని సాహిత్య విమర్శకులు 'ఫోసె మినిమలిజమ్'గా వ్యవహరిస్తున్నారు. కాగా, సాహిత్య నోబెల్ అందుకున్న నార్వే రచయితల్లో ఫోసె నాలుగోవారు. ఆయనకు ముందు బ్యోన్‌స్టానా బ్యోన్‌సన్, నాట్ హామ్సున్, సిగ్రిడ్ అన్‌సెట్ ఈ పురస్కారం అందుకున్నారు. 1928 తర్వాత తిరిగి 95 ఏళ్లకు ఫోసె రూపంలో ఈ గౌరవం నార్వేకు దక్కడం విశేషం.

# రోడ్లు వేయలేని నువ్వొక సీఎంవా!

ఏలూరు: 'పట్టుమని పాతిక కిలోమీటర్ల దూరం లేని కైకలూరుకు 65 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వచ్చింది. రోడ్లు వేయలేని నువ్వు ఒక ముఖ్యమంత్రివి. ఇంటర్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్సులు ఇవ్వడానికి కూడా నీ దగ్గర డబ్బులు లేవా?" అంటూ ముఖ్యమంత్రి జగన్‌ను జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. కొల్లేరు కాంటూరుకు వైఎస్ ఒక లెక్క చెప్పారని, ఆయన కుమారుడు జగన్‌కు కాంటూరు అంటేనే తెలియదని ఎద్దేవా చేశారు. కొల్లేరు సమస్యలను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తాను ఎన్డీయే కూటమి నుంచి బయటకు వచ్చేశానని జగన్ అండ్ కో ప్రచారం చేస్తోందని, తన గురించి బాధ అవసరం లేదన్నారు. తాను ఎన్డీయేలోనే ఉన్నానని తెలిపారు. గతం మరిచిపోయి జనసైనికులను కూర్చొబెట్టి టీడీపీ నాయకులు మాట్లాడాలని సూచించారు. వారాహి విజయయాత్ర నాలుగోవ విడతలో భాగంగా గురువారం సాయంత్రం ఏలూరు జిల్లా ముదినేపల్లి గురజరోడ్డులో జరిగిన బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. ఈ సభలో వైసీపీ నాయకుల అరాచకాలను, జగన్ అక్రమాలను దుయ్యబట్టారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

**ప్రింటర్లకు, పేపర్లకు కూడా డబ్బుల్లేవా?**

"ఈ సంవత్సరం ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా జగన్ ప్రభుత్వం ఇవ్వలేదు. 151 మంది ఎమ్మెల్యేలు, 22 మంది ఎంపీలు ఉన్న సీఎంకు ప్రింటర్లు, పేపర్లుకు కూడా దిక్కులేదా? సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్సులు కూడా ఇవ్వలేరా? భవిష్యత్తులో ప్రజలు ఎవరైనా ఆస్తులు కొంటే ఆ దస్తావేజులు కూడా జగన్ దగ్గరే ఉంటాయి. అంటే అంచలంచెలుగా మన జీవితాలను లాగేసుకుంటున్నాడు. రూ.8,600 కోట్ల పంచాయతీ నిధులను మింగేసిన జగన్ నిర్వాకాన్ని ప్రజలకు చెప్పాలని ప్రతీ చోట సర్పంచ్‌లు నన్ను కలుస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్యేలను ఒక్కటే అడుగుతున్నా ఎప్పుడైనా మీ జేబుల్లోంచి రూ.కోటి లేదా రూ.10 లక్షలు తీసి ఎవరికైనా పంచిపెట్టారా? మీలాంటి వారికి క్లాస్‌వార్ గురించి మాట్లాడే హక్కు లేదు. మద్యనిషేధం పేరు చెప్పి మద్యం షాపుల్లో జగన్ మందు అమ్ముకుంటున్నాడు. ఉదయం సంక్షేమ ప?థకాల డబ్బులు చేతికిస్తూ సాయంత్రానికి మందు రూపంలో లాగేసుకుంటున్నాడు. ఆడవాళ్లు నిజంగా కోరుకుంటే గ్రామాల్లో మద్యనిషేధం చేయవచ్చు"

**ఆరు నెలల్లో కొల్లేరుకు పరిష్కారం**

"జగన్‌కు కొల్లేరు అంటే తెలియదు. వాళ్ల నాన్న వచ్చి ఒక లెక్క చెప్పి వెళ్లారు. జగన్ ఏమో ఇంకో లెక్క చెప్తారు. ఇటు చూస్తే కొల్లేరులో 17 వేల టన్నుల కాలుష్య వ్యర్థాలు వచ్చి కలుస్తున్నాయి. కైకలూరు, అవనిగడ్డ, పెడన, మచిలీపట్నం కేంద్రాలుగా చేసుకొని ఎకో టూరిజం అభివృద్ధి చేయవచ్చు. రాష్ట్రానికి 40శాతం ఆదాయం అందిస్తున్న గోదావరి, కృష్ణా జిల్లాలతో పాటు వైజాగ్‌లో కోల్డ్ స్టోరేజ్‌లు, క్వాలిటీ సీడ్ ఉత్పత్తి, విద్యుత్ సబ్సిడీలు లేవు. ఈ తరహా కొల్లేరు సమస్యలను టీడీపీ, జనసేన బలంగా అర్థం చేసుకున్నాయి. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో సమస్యకు పరిష్కారం చూపిస్తాం. కొల్లేరు నీటిని శుద్ధి చేయకపోగా దందాలు, కమీషన్లు చేస్తున్న ఎమ్మెల్యేను, ఆయన కుమారుడిని చూస్తూ ఊరుకోం. ఏ పోలీసులను ఇబ్బంది పెట్టారో వారితోనే మక్కెలు విరగ్గొట్టిస్తాం"

# ప్రలోభాలపై పక్కా నిఘా

(మొదటి పేజీ తరువాయి)

నియంత్రించాలని, వీటిపట్ల అత్యంత అప్రమత్తంగా ఉంటూ కఠినంగా వ్యవహరించాల్సిందిగా కేంద్ర, రాష్ట్రాల ఎన్నికల యంత్రాంగాన్ని ఆదేశించామని తెలిపారు. వారు కఠిన చర్యలు తీసుకునేలా తాము చేస్తామని చెప్పారు.గత అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ప్రలోభాల గురించి తాము విన్నామని, ఇలాంటి విషయంలో తమ చర్యలు ఎలా ఉంటాయో ఈసారి చూడబోతున్నారని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడగానే అధికార యంత్రాంగం యావత్తూ డెప్యుటేషన్‌పై ఈసీ పరిధిలోకి వస్తుందని వివరించారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేయడం, వాటికి ఫైనాన్స్ చేయడం, నిర్మూలించాల్సిన బాధ్యతల్లో ఉండి అవకాశం కల్పించడం నేరమేనని, ఐపీసీలోని పలు సెక్షన్లతో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం కింద శిక్షార్హులని రాజీవ్‌కుమార్ స్పష్టం చేశారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సన్నద్ధతను పరిశీలించడానికి మూడురోజుల రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆయన.. గురువారం చివరిరోజు సహచర ఎన్నికల కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. 'బ్యాంకులు నగదు రవాణా వాహనాలను నిర్దేశిత సమయాల్లోనే నడిపించాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ)ని ఆదేశించాం. ఎన్నికల్లో అక్రమ నగదు రవాణాకు ఆ వాహనాలను వినియోగించే అవకాశం ఉందని గుర్తించాం. అంబులెన్సులు, ప్రభుత్వ వాహనాల్లో డబ్బు, ఇతర వస్తువుల అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు చేయాలని సంబంధిత యంత్రాంగాలను కోరాం. చీరలు, కుక్కర్లు వంటి ఎన్నికల్లో పంపిణీ చేసే కానుకలను నిల్వ చేసే ప్రైవేటు గోదాముల వద్ద గట్టి నిఘా పెట్టాలని రాష్ట్ర దర్యాప్తు సంస్థలను కోరాం. రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లతో పాటు ఎయిర్‌పోర్టులు, కార్గో ఫ్లైట్లు, ప్రైవేటు ఎయిర్‌స్ట్రిప్‌లు, రాజకీయ నేతలు వినియోగించే వాణిజ్యేతర విమానాలు, ప్రత్యేక విమానాలు సైతం తనిఖీ చేయాలని కోరాం.పేమెంట్ వ్యాలెట్ల ద్వారా జరిగే ఆన్‌లైన్ నగదు లావాదేవీలపై నిఘా పెట్టాలని ఆర్బీఐ, ఎస్ఎల్‌బీసీకి సూచించాం.

# ఇక అమీతుమీయే!

(మొదటి పేజీ తరువాయి)

ఆ వర్గం నేతలు నిర్ణయించారు. గురువారం రాత్రి నగర శివారు శంషాబాద్‌కు సమీపాన రాళ్లగూడలోని ఓ కళాశాలలో సమావేశమైన బీసీ నేతలు.. పార్టీలోని కొందరు బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తీరుపై కూలంకషంగా చర్చించినట్లు సమాచారం. బీసీలకు టికెట్ల వ్యవహారంపై అంతర్గతంగా పార్టీలోనే చర్చించాలని, బహిరంగంగా పత్రికలకు ఎక్కరా దంటూ పార్టీలోని కొందరు నేతలు హెచ్చరికలు చేయడాన్ని వారు తీవ్రంగా తప్పుపట్టినట్లు తెలిసింది. ఇది బీసీలను అణగదొక్కే చర్యగా వారు అభిప్రాయపడినట్లు సమాచారం. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్, కాసుల బాలరాజ్, శ్రీహరి ముదిరాజ్ దండ శ్రీనివాస్, ఐనీల దామోదర్, ప్రదీప్‌కుమార్ వంటి నేతలు దాదాపు 40 మంది పాల్గొన్నారు. టికెట్ల వ్యవహారంలో సామాజిక సమతుల్యత పాటించకపోతే ఎలా అని, రాజకీయ వ్యవహారాల కమిటీ లో చేసిన నిర్ణయాన్ని కూడా గౌరవించకపోవడం ఏమి పద్ధతి అని కొందరు ప్రశ్నించారు. సర్వేలు, ఆర్థిక పరిస్థితులనే సాకులు చూపి బీసీలకు టికెట్లలో కోత విధించడం సమంజసం కాదని వారు పేర్కొన్నట్లు తెలిసింది. టికెట్ల ఖరారుకు ముందే బీసీలకు 34 స్థానాలు (ప్రతి పార్లమెంట్‌లో రెండు అసెంబ్లీ స్థానాలు) కేటాయింపు విషయం మరోసారి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని, ఢిల్లీ కూడా వెళ్లి పార్టీ పెద్దలను కలిసి పరిస్థితిని వివరించాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఈ సమావేశంలో పాల్గొన్న ఓ నాయకుడు వెల్లడించారు. సీనియర్లు మధుయాష్కీ, పొన్నం ప్రభాకర్, మహేశ్‌కుమార్‌గౌడ్ వంటి నేతలు హాజరుకాకపోయినా.. సమావేశంలో చర్చించిన అంశాలను వారికి వివరించినట్లు తెలిసింది. గత నెలలోనే బీసీ నేతలంతా ఢిల్లీ వెళ్లి పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశమై బీసీలకు 34 సీట్లు ఇవ్వాలని కోరిన విషయం విదితమే.

# 27 కోట్లతో ఏం సంబంధం?

(మొదటి పేజీ తరువాయి)

స్పందిస్తూ.. స్కిల్ కార్పొరేషన్ నిధులు ఈ ఖాతాలకు వెళ్లినట్లు తేలితే సీఐడీకి సంబంధం ఉంటుంది కదా అన్నారు. దీనికి దూబే సమాధానం ఇస్తూ.. ఖాతాలకు వెళ్లినట్లు ఇప్పటి వరకు ఒక్క ఆధారాన్ని కూడా కోర్టుకు సీఐడీ అందజేయలేదన్నారు. నిధుల మళ్లింపునకు సంబంధించి ఈ నెల 1న ఆడిటర్ జె.వెంకటేశ్‌కు నోటీసు ఇచ్చామన్న ప్రాసిక్యూషన్ వాదన సరికాదన్నారు. సీఐడీ ఆయనకు రెండో తేదీన నోటీసిస్తే.. పదో తేదీన విచారణకు వస్తానని ఆయన సమాధానం ఇచ్చారని చెప్పారు. ఆయనకు కుదిరినప్పుడు విచారణకు వస్తారని.. దీనిని ఆధారంగా చేసుకుని సీఐడీ.. చంద్రబాబును కస్టడీకి ఎలా అడుగుతుందని ప్రశ్నించారు. స్కిల్ కార్పొరేషన్ ఏర్పాటుకు నియమించిన అధ్యయన కమిటీలో చంద్రబాబు లేరని, ఆయన ఎలాంటి సిఫారసులూ చేయలేదని చెప్పారు. నోట్ ఫైల్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వ ఉత్తర్వులు వస్తే దానిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో మొత్తం 40 స్కిల్ డెవల్‌పమెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి, వాటిలో 2.13 లక్షల మంది యువతకు శిక్షణ ఇచ్చారని దూబే కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వాటికి నిధులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. స్కిల్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్, డిజైన్‌టెక్, సీమెన్స్ సంస్థకు మధ్య జరిగిన ఒప్పందంలో చంద్రబాబుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆయన ప్రమేయం లేని ఎంవోయూను ఆయనకు ఎలా ఆపాదిస్తారని ప్రశ్నించారు.

**రెండు కేసులు ఎలా?**

2018లో అవినీతి నిరోధక శాఖలో సీఐయూ(సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్)కు చెందిన కె.నాగేశ్వరరావు అనే అధికారి స్కిల్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్‌కు ఒక లేఖ రాశారని దూబే కోర్టుకు వివరించారు. కార్పొరేషన్‌కు సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లను అందజేయాలని అందులో కోరారని తెలిపారు. దీనినిబట్టి కేసు 2018లోనే ఉందని తెలుస్తోందని.. ఇదే అంశంపై తిరిగి సీఐడీ ఎలా కేసు పెడుతుందని ప్రశ్నించారు. ఒకే నేరంపై రెండు కేసులు ఉండవని తెలిపారు. ఒకవేళ అలా జరిగితే మొదటిగా నమోదు చేసిన కేసు మాత్రమే నిలుస్తుందని, రెండో కేసు నిలవదని స్పష్టం చేశారు. 'సీఐడీ పోలీసులు నిజాయితీగా వ్యవహరించడం లేదు. స్కిల్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్‌కు చైర్మన్‌గా ఘంటా సుబ్బారావును నియమించినంత మాత్రాన నేరానికి చంద్రబాబు ఎలా సూత్రధారి అవుతారు? 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ ముగిశాక పోలీసు కస్టడీకి తీసుకోవడం కుదరదు. కోర్టు రెండ్రోజుల కస్టడీకి ఇచ్చినప్పుడు జైలుకు ఉదయం 9.30 గంటలకు వెళ్లాల్సిన అధికారులు 11.30 గంటలకు వెళ్లారు. విచారణలో చంద్రబాబు చెప్పిన జవాబులను వారు రాసుకోలేదు. చివరి రోజున తాము చెప్పినట్లుగా చెప్పాలని ఆయనపై ఒత్తిడి చేశారు. సీఐడీ తప్పుడు డాక్యుమెంట్లు ఇచ్చి కోర్టును తప్పుదోవ పట్టిస్తోంది. దీనిపై కోర్టు ధిక్కరణ నేరం కింద చర్యలు తీసుకోవాలి' అని కోరారు. ఫైబర్‌నెట్, ఐఆర్ఆర్ కేసుల్లో సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్లు.. చంద్రబాబుకు బెయిల్ ఇచ్చేందుకు అడ్డురావని తెలిపారు.

**'స్కిల్' ఐడియా చంద్రబాబుదే: ఏఏజీ**


స్కిల్ కార్పొరేషన్ ఏర్పాటు, దాని నిధుల దారి మళ్లింపు ఆలోచన అంతా చంద్రబాబుదేనని అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ)పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మొత్తం కుంభకోణానికి ఆయన సహకరించారని.. సీఎంకు వీటో అధికారం ఉంటుందని, దాన్ని ఉపయోగించుకుని నోట్ ఫైల్‌ను మార్చేశారని.. కార్పొరేషన్ నిధులు దారి మళ్లించారనడానికి ఇదే నిదర్శనమన్నారు. నిధులు మళ్లించుకోవడానికి ముందుగానే ప్రణాళిక వేసుకుని, దానికి రక్షణగా మంత్రివర్గ నిర్ణయాన్ని అడ్డుపెట్టుకున్నారన్నారు. రెండ్రోజుల కస్టడీలో చంద్రబాబు వివరాలేమీ చెప్పలేదని.. ఆయన నుంచి రాబట్టాల్సి ఉందని.. అందుకోసమే కస్టడీకి అడుగుతున్నామన్నారు. యూటీఐ బ్యాంక్ నుంచి టీడీపీకి చెందిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్లలోకి రూ.27 కోట్లు వెళ్లాయని చెప్పిన ఏఏజీ.. కొన్ని డాక్యుమెంట్లను కోర్టుకు అందజేశారు. అసలు సీమెన్స్ అనే సంస్థే లేదన్నారు.

**బాబు జ్యుడీషియల్ రిమాండ్ 19 వరకు పొడిగింపు**

స్కిల్ డెవల్‌పమెంట్ కేసులో అరెస్టయిన టీడీపీ అధినేత చంద్రబాబు జ్యుడీషియల్ రిమాండ్‌ను ఏసీబీ కోర్టు మరో రెండు వారాలు పొడిగించింది. గురువారంతో రిమాండ్ గడువు ముగిసిపోవడంతో ఆయనకు తొలుత వైద్య పరీక్షలు నిర్వహించి.. సాయంత్రం 4.20 గంటలకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి ఆయన్ను వర్చువల్‌గా ఏసీబీ కోర్టు న్యాయాధికారి హిమబిందు ఎదుట హాజరుపరిచారు. రిమాండ్‌ను ఈ నెల 19వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఆమె తెలిపారు. కాగా.. సీఐడీ అధికారులు రెండ్రోజుల కస్టడీలో చేసిన విచారణకు సంబంధించిన వివరాలను అందజేయాలని చంద్రబాబు ఆమెను కోరారు. సీఐడీ అధికారులు వేసిన ప్రశ్నలు, తాను ఇచ్చిన జవాబులకు సంబంధించిన కాగితాలను అందజేయాలని విజ్ఞప్తి చేయగా.. దీనికి న్యాయాధికారి సమ్మతించారు.

# ముడుపులకు సాక్ష్యాలున్నాయా?

(మొదటి పేజీ తరువాయి)



గురువారం సుప్రీంకోర్టు దర్యాప్తు సంస్థలను పలు అంశాలపై నిలదీసింది. లిక్కర్ గ్రూప్ నుంచి సిసోడియాకు ముడుపులు అందాయని ఆరోపిస్తున్నారని.. అవి ఎలా అందాయని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిల ధర్మాసనం ఈడీ, సీబీఐని ప్రశ్నించింది. "మీరు రూ.100 కోట్లు, రూ.30 కోట్లు అని రెండు సంఖ్యలు చెబుతున్నారు. ఈ సొమ్ము ఎవరు చెల్లించారు? అందుకు ఏమైనా ఆధారాలున్నాయా? దినేశ్ అరోరా కూడా ఈ కేసులో నిందితుడే కదా? ఆయన వాంగ్మూలం కాకుండా మరో సాక్ష్యం ఏదైనా ఉందా?" అని జస్టిస్ ఖన్నా ప్రశ్నించారు. దర్యాప్తు సంస్థలు చెబుతున్న 'చైన్ (గొలుసుకట్టు)' పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదని వ్యాఖ్యానించారు. కొందరు వ్యక్తులకు లబ్ధి చేకూరే విధంగా ఢిల్లీ మద్యం విధానాన్ని రూపొందించారని సీబీఐ ఆరోపించింది. దీనికి సంబంధించి కొన్ని వాట్సాప్ సందేశాలను సాక్ష్యంగా సమర్పించింది. ఆ సందేశాల ఆమోదయోగ్యతపై ధర్మాసనం సందేహం వ్యక్తం చేసింది. "లంచాల గురించి సిసోడియా, విజయ్ నాయర్ మాట్లాడుకోవడం మీరేమైనా చూశారా? ఈ సాక్ష్యాలు ఆమోదయోగ్యంగా ఉంటాయా? క్రాస్‌ఎగ్జామినేషన్‌లో ఇది రెండు నిమిషాల్లో వీగిపోతుంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సిసోడియాకు ఎక్కడ భాగస్వామ్యం ఉందని? ఆయన్ను మనీలాండరింగ్ చట్టం పరిధిలోకి ఎలా తెస్తారని ప్రశ్నించింది. తదుపరి విచారణను 12కు వాయిదా వేసింది. కాగా, మద్యం కేసులో అందిన రూ.100 కోట్ల లంచం సొమ్మును ఆప్ గోవా ఎన్నికల ప్రచారానికి వినియోగించిందని ఈడీ ఆరోపించిన నేపథ్యంలో.. ఆప్‌ను కేసులో ఎందుకు చేర్చలేదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కాగా, ఢిల్లీ మద్యం కేసులో బుధవారం అరెస్టయిన ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌కు సీబీఐ ప్రత్యేక కోర్టు ఐదు రోజుల కస్టడీ విధించింది. ఆయన్ను ఈ నెల 10 వరకు ఈడీ కస్టడీకి అనుమతిస్తూ జడ్జి ఎంకే నాగ్‌పాల్ ఉత్తర్వులిచ్చారు.

**చట్టసభల్లో అవినీతి.. తీర్పు రిజర్వు**

చట్టసభల్లో ఓటు వేసేందుకుగానీ, ప్రసంగించేందుకుగానీ లంచం తీసుకునే సభ్యులను ప్రాసిక్యూట్ చేయకుండా మినహాయింపు ఉందంటూ 25 ఏళ్ల కిత్రం ఇచ్చిన తీర్పుపై సమీక్ష జరిపిన సుప్రీంకోర్టు గురువారం నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఝూర?ండ్ ముక్తిమోర్చా లంచం కేసుగా ప్రచారంలోకి వచ్చిన ఈ విషయమై 1998లో తీర్పు ఇచ్చిన అయిదుగురు సభ్యుల ధర్మాసనం.. ప్రాసిక్యూషన్ చేయకుండా రాజ్యాంగం ప్రకారం రక్షణ ఉందంటూ తీర్పు ఇచ్చింది. దీన్ని పునఃసమీక్ష జరపాలంటూ ప్రస్తుతం దాఖలైన వ్యాజ్యంపై సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం విచారణ జరిపింది. తీర్పును రిజర్వు చేసింది.

# పోలవరం ఫలాలు త్వరగా అందాలి

(మొదటి పేజీ తరువాయి)

చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు.ప్రజలకు ప్రాజెక్టు ఫలితాలు అందించడానికి సహకరించాలని కోరారు. పూర్తి నిర్మాణ వ్యయంపై తాజా అంచనాలకు ఆమోదం తెలపాలన్నారు. 2017%--%18 ధరల సూచీ ప్రకారం పోలవరం ప్రాజెక్టు వ్యయం రూ.55,548.87 కోట్లుగా ఇప్పటికే సాంకేతిక సలహా కమిటీ ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. దీనికి ఆర్థిక శాఖ ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు అడహాక్‌గా నిధులు విడుదల చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు రూ.12,911.15 కోట్ల విడుదలకు ఆమోదం లభించడం సంతోషకరమని, అయితే దీన్ని పునఃపరిశీలించి తాజాగా అంచనాలను రూపొందించామని తెలిపారు.లైడార్ సర్వే ప్రకారం అదనంగా 36 ఆవాసాల్లో ముంపు కుటుంబాలను రక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉందని, 2022 జూలైలో వచ్చిన భారీ వరదల వల్ల తలెత్తిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తొలి దశ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చేయాల్సిన పనులపై ఈ అంచనాలు రూపొందించామని చెప్పారు. పోలవరం తొలి దశను పూర్తి చేయడానికి ఇంకా రూ.17,144.06 కోట్లు అవసరమవుతాయని, ఆ మేరకు నిధులు విడుదలచేయాలని కోరారు.

**రూ.1,355 కోట్లు రీయింబర్స్ చేయాలి**

ప్రాజెక్టు నిర్మాణం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధుల నుంచి ఖర్చు చేసిన రూ.1,355 కోట్లను రీయింబర్స్ చేయాలని సీఎం జగన్ కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలు సుదీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. రూ.7,359 కోట్లను తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ బకాయిల రూపంలో చెల్లించాల్సి ఉందన్నారు. 2014 జూన్ నుంచి 2017 జూన్‌వరకు సరఫరా చేసిన విద్యుత్‌కు ఇప్పటి వరకు ఛార్జీలు చెల్లించలేదని, తొమ్మిదేళ్లుగా ఈ సమస్య పెండింగులో ఉందని గుర్తు చేశారు. ఏపీ జెన్‌కోకు, డిస్కంలకు ఇది తీవ్ర గుదిబండగా మారిందని తెలిపారు. తద్వారా వివిధ సంస్థలకు చెల్లింపులు చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తెలంగాణ నుంచి సొమ్ము వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సొమ్ము ఇప్పించాలంటూ ఏపీ ప్రభుత్వం పలుమార్లు విజ్ఞప్తులు చేసిన తర్వాత 30 రోజుల్లోగా ఏపీకి బకాయిలు చెల్లించాలంటూ 2022 ఆగస్టు 29న కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. అయితే తెలంగాణ రాష్ట్రం హైకోర్టును ఆశ్రయించిందని, దీంతో ఈ అంశంలో కోర్టు పరిధిలోకి వెళ్లిందని తెలిపారు. ఏపీ విద్యుత్ సంస్థలకు ఆ సొమ్ము వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ రంగానికి సంబధించి పలు అంశాలపై చర్చించారు.

**ఏపీలో విద్యుత్ రంగం బాగుంది**

అనంతరం కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ మీడియాతో మాట్లాడారు. ఏపీలో విద్యుత్ రంగం అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించానన్నారు. ఏపీలో విద్యుత్ రంగం పనితీరుపై కేంద్రం సంతృప్తిగా ఉందని స్పష్టం చేశారు. రీ వ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్‌డీఎస్ఎస్)కు ఏపీ క్వాలిఫై అయిందని తెలిపారు. తెలంగాణ విద్యుత్ బకాయిలపై మీడియా ప్రశ్నకు ఆయన సమాధానం ఇవ్వడానికి నిరాకరించారు.

# ఉమ్మడి మానాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా

**-మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి..**

**ఉమ్మడి మానాలలో మంత్రి పర్యటన**

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**





**సమ సమాజం:** ఉమ్మడి మానాల గ్రామాన్ని అన్ని రంగాల్లో అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని రాష్ట్ర మంత్రి వర్యులు వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఆయన తన నియోజకవర్గంలోని మానాల గ్రామంలో గురువారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మానాల వచ్చిన ఆయనకు ప్రజా ప్రతినిధులు, నాయకులు,అధికారులు,ప్రజలు ఘన స్వాగతం పలికారు.ముందుగా హనుమాన్ తండా,గొర్రె గుండం వెళ్లే రోడ్డు నిర్మాణానికి 1కోటి 12 లక్షల పనులకు శంకుస్థాపన చేశారు. వ్యవసాయ సహకార సంఘం వద్ద 7 కుల సంఘాలు సంబంధించిన భవనాలకు అరవై లక్షల రూపాయల ప్రొసీడింగ్ లను అందజేశారు. అనంతరం మున్నూరు కాపు ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో 762 మంది లబ్ధిదారులకు 1750 ఎకరాల పోడు భూముల పట్టాలు పంపిణి చేశారు.అలాగే నూతన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించారు. అలాగే మానాల తాతమ్మ బ్రిడ్జి నిర్మాణ పనులకు 2.20 కోట్లతో శంకుస్థాపన చేశారు.20 లక్షలతో నూతనంగా నిర్మించిన దేగావత్ తండా గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. అనంతరం గిరిజనులకు పోడు భూముల పట్టాలను పంపిణీ చేశారు.అలాగే వివిధ కుల సంఘల భవన నిర్మాణాలకు నిధుల మంజూరు ప్రొసీడిం కాపీలను అందజేశారు.మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అలాగే ప్రతి గ్రామపంచాయతీ కి స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ. నియోజకవర్గంలో అన్ని గ్రామలలాగా కాకుండా మానాల గ్రామన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేశానని అన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలనైనా వెంటనే పరిష్కారం అయ్యే విధంగా చేస్తున్నానని అందులో ఒక్క గ్రామం కొసం హాస్పిటల్, సొసైటీ, గిరిజన బాలికల పాఠశాల, బ్రహ్మాండమైన రోడ్లు, మొత్తం సుమారు 100 కోట్ల రూపాయలతో ఇప్పటి వరకు అభివృద్ధి చేయడం జరిగింది.16 తాండలను 8 గ్రామపంచాయతి లుగా ఏర్పాటు చేయడం జరిగింది.అన్ని గ్రామపంచాయితిలకు భవనాలు మంజూరు చేయడం జరిగింది. అందులో రెండు నిర్మాణం పూర్తి చేయడం జరిగింది.16 తండాకు 67 లక్షలలు తీజ్,లేదా సేవాలాల్ మహరాజ్ భవనాలు మంజూరు చేయడం జరిగింది.గృహ లక్ష్మీ పథకం కింద ఉమ్మడి మానాల గ్రామానికి 100 మంజూరు చేస్తా,అలాగే ఎన్నికల తరువాత మరో 100 మంజూరు చేస్తానని తెలిపారు.నియోజక వర్గంలో ఎక్కడ జరుగంటువంటి పనులు ఉమ్మడి మానాల గ్రామంలో జరిగాయని రాబోయే ఎన్నికలలో నన్ను ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నా నేను పనులు చేసే విషయంలో వ్యక్తులను చూడకుండా,ఏ పార్టీ అని చూడకుండా ప్రతి ఒక్కరికి పనులు చేశానని ఆయన అన్నారు. కాంగ్రెస్,బిజెపి పార్టీల నాయకులు వాళ్ళు చెప్పే మాటలు నమ్మితే ప్రజల్ని నట్టేట ముంచుతారని గుర్తు చేశారు.మానాల అంటే తనకు ఎనలేని అభిమానమని అన్నారు.అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉన్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అని మూడవ సారి కూడా కారు గుర్తుకు ఓటేసి కెసిఆర్ ను ముఖ్యమంత్రి ని చేయాలని ప్రజలను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కోరారు. ఈకార్యక్రమంలో, ఎంపిపి గంగం స్వరూప మహేష్,వైస్ ఎంపిపి పిసరి భూమయ్య, బిఆరెస్ మండల అధ్యక్షుడు దెగవత్ తిరుపతి,ఎంపిటిసి గుగులతో గంగిబాయి,మజి వైస్ ఎంపిపి బాధనవేణి రాజారాం,అన్ని గ్రామాల సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# కేసిఆర్ నాయకత్వం లో తెలంగాణ లో క్రీడా విప్లవం

**జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్**

**సీఎం కేసిఆర్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే**




**జగిత్యాల, సమ సమాజం:** రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ నాయకత్వం లో తెలంగాణ లో క్రీడా విప్లవం సాధించామని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు.జగిత్యాల పట్టణ వివేకానంద మినీ స్టేడియంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమం లో జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ క్రీడాకారులకు సీఎం కేసీఆర్ స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతరానికి సీఎం కేసీఆర్ కానుకగా రాష్ట్ర వ్యాప్తంగా విలువైన 18వేల కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.బడ్జెట్ లో దాదాపు 100కోట్ల రూపాయల కు పైగా కేటాయించి, యువత భవిత కోసం విలువైన క్రీడా సామాగ్రిని అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు.కేసిఆర్ స్పోర్ట్స్ కిట్ లో క్రికెట్, వాలీబాల్, టెన్నికాయిట్ ,జిమ్ సామాగ్రి తో కలుపుకొని 23 క్రీడా భాగాల స్పోర్ట్స్ మెటీరియల్స్ ఉన్నాయన్నారు.దేశంలో ఏ రాష్ట్రంలో కూడా నేటి వరకు యువత,క్రీడాకారుల కోసం అమలుకాలేదు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం యువత కోసం గొప్ప స్కీం కు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే సంజయ్ చెప్పారు.ఇప్పటికే18వేలకు పైగా గ్రామీణ క్రీడా ప్రాంగణాల నిర్మాణం తో దేశంలో కొత్త చరితకు నాంది పలికినట్లైందని,రాష్ట్ర విభజనకు ముందు తెలంగాణ క్రీడా కారుల పట్ల ఆదరణ కరువైందని అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ లో క్రీడా విప్లవంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర క్రీడాకారులు పథకాల పంట పండిస్తున్నారని,క్రీడలతో మానసిక శారీరక ఉల్లాసం స్నేహ భావం పెంపొందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు .తెలంగాణ ఆచరిస్తున్న అనేక సంక్షేమ, ప్రజాహిత కార్యక్రమాలు దేశం అనుసరిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ అనిల్,కౌన్సిలర్ లు చుక్క నవీన్,కూతురు రాజేష్,కప్పల శ్రీకాంత్,డిఈ రాజేశ్వర్,డి వై ఎస్ ఓ రవి, నాయకులు సింగ రావు,కూతురు శేకర్ తదితరులు పాల్గొన్నారు.



# మహేశ్వరం నియోజకవర్గం లో ఇల్లు లేని పేదలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించాలి.

**ప్రభుత్వానికి ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ గోపాల్ విజ్ఞప్తి**



**ఎల్బీనగర్ సమ సమాజం:** రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు తెస్తూ పేద ప్రజల ఆదరణ చూరగొంటున్న సీఎం కేసీఆర్ మహేశ్వరం నియోజకవర్గంలోని ఇండ్లు లేని పేదలందరికీ ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ గోపాల్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వేలాది పేద కుటుంబాలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు పంపిణీ చేసిన ప్రభుత్వం తమ డిమాండ్ను పరిశీలించి తమ నియోజకవర్గంలోని పేదలకు న్యాయం చేయాలని కోరారు. గురువారం రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ మండలపరిధి ఎన్టీఆర్ నగర్ లోని తెలంగాణ ఫంక్షన్ హాల్ లో ఇస్కఫ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సీపీఐ భగత్ సింగ్ నగర్ ఫేజ్-2 కార్యదర్శి ఐ. పాపయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వేలాది మంది ఇండ్లు లేని పేద ప్రజలు హాజరయ్యారు. 'అద్దెలు కట్టలేకపోతున్నాం.. ప్రభుత్వ స్థలాల్లో జాగా ఇవ్వాలి' అంటూ నినదించారు. ఈ సందర్భంగా ఆర్.గోపాల్ మాట్లాడుతూ, సొంతింటి కల అనేది ప్రతి ఒక్కరికీ ఉంటుందన్నారు. ఆ కలను నెరవేర్చుకోవాలంటే మనమంతా కలిసికట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఇప్పటికే ఈ విషయమై మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశానని తెలిపారు. దీనిపై తమ సహకారం ఉంటుందని మంత్రి హామీనిచ్చారని వెల్లడించారు. ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. గతంలో కూడా ఇండ్ల స్థలాలపై పోరాటాలు చేసి, మంచి విజయాలు సాధించామని గుర్తుచేశారు. ఆ తరహాలోనే ఇండ్ల స్థలాలను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఐ భగత్ సింగ్ నగర్ శాఖ ఫేజ్-1 కార్యదర్శి మహమూద్ మహబూబ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం డబుల్ బెడ్ రూంలు నిర్మించే సమయం లేదని ప్రభుత్వం గ్రహించి.. వెంటనే ఇండ్లు లేని పేద కుటుంబాలకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కనీసం గుడిసెలు వేసుకొని బతుకులున్నా సొంత జాగా ఉన్నదనే భరోసా పేద ప్రజల్లో కలుగుతుందని ప్రభుత్వానికి విన్నవించారు. సమావేశ ముగింపు సందర్భంగా సీపీఐ ఎన్టీఆర్ నగర్ కార్యదర్శి మహ్మద్ ఇస్మాయిల్ వందన సమర్పణ చేశారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ నగర్ ముఖ్య నాయకులు మున్నాబాయ్ , షకీల్, జీ యాదయ్య, సయ్యద్ ఇస్మాయిల్, ఎండీ ఇస్మాయిల్, ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్ పటేల్, సీపీఐ సీనియర్ నాయకులు జాహెద్, సీపీఐ నగర కార్యవర్గసభ్యుడు ఎస్ఎ మన్నన్, సీపీఐ మలక్ పేట్ కార్యదర్శి షేక్ మియా, ఎ సిద్ధిఖీ తదితరులు పాల్గొన్నారు.

# జల్లేపల్లి అంగన్వాడి ఆయా అనారోగ్యంతో మృతి



**తిరుమలాయపాలెం సమ సమాజం:** తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ అంగన్వాడి సెంటర్ 1 లో పనిచేస్తున్న అంగన్వాడి ఆయా కొండ్రు ఎల్లమ్మ భర్త బిక్షం (44) బుధవారం రాత్రి అనారోగ్యంతో అకస్మాత్తుగా ఖమ్మం లెనిన్ నగర్ లో గల ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మరణించినది. ఆమెకు ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు కలరు. ఆమె పార్థివదేహాన్ని స్థానిక పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి సందర్శించి నివాళులు అర్పించి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆమె కుమారుడు మనోజ్ కు అందించారు. ఆయన వెంట తిరుమలాయ పాలెం ఎంపీపీ మంగీలాల్ నాయక్, బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, స్థానిక జల్లేపల్లి సర్పంచ్ శైలజ తదితరులు నివాళులర్పించారు. ఐసిడిఎస్ అధికారులు సిడిపిఓ బాల త్రిపుర సుందరి, ఎ సి డి పి ఓ, ఉదయశ్రీ సూపర్వైజర్ ప్రసూన, అంగన్వాడీ టీచర్లు పద్మ, మలుసూరమ్మ, రమ, నాగమణి ఆయాలు ఆమె మృతదేహాన్ని సందర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తల్లి మృతదేహం పైపడి విలపిస్తున్న ఆడపిల్లల్ని చూసి పలువురు కంటతడి పెట్టారు. వారినీ ఓదార్చుట సాధ్యం కావటం లేదని పలువురు ఆవేదన చెందారు. గత 20 సంవత్సరాల నుండి ఆయాగ పనిచేస్తూ వృత్తిరీత్యా పద్ధతిగా పనిచేసేదని ఆమె యొక్క సేవలను ఐ సి డి ఎస్ అధికారులు కొనియాడారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ



**జగిత్యాల టౌన్/సమ సమాజం:** జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్వర్యంలో చల్ గల్ లోని వ్యవసాయ మార్కెట్ లో 1 కోటి 70 లక్షలతో అంతర్గత సిసి రోడ్లు, సీసీ కల్లాల ఏర్పాటుకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ , జెడ్పీ చైర్మన్ దావా వసంత సురేష్ తో కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ యం సి ఛైర్మెన్ నక్కల రాధ రవీందర్ రెడ్డి, యంపీపీ రాజేంద్ర ప్రసాద్, పాక్స్ చైర్మన్ లు సందీప్ రావు, మహిపాల్ రెడ్డి వైస్ చైర్మన్ అసిఫ్, డి యం ప్రకాష్ , సెక్రెటరీ రాజశేఖర్, సర్పంచ్ గంగనర్సు రాజన్న,ఉప సర్పంచ్ పద్మ తిరుపతి,గ్రామ శాఖ అధ్యక్షులు పుదరి శ్రీనివాస్,ఏఎంసీ డైరెక్టర్లు నరేష్ ,రాజేష్, ఆనంద్ రావ్, సురేష్ , గర్వందుల గంగన్న, దమ్మ రాజి రెడ్డి ,కొలగాని లచ్చన్న, శారద, దయాల మల్లారెడ్డి , పులిశెట్టి శ్రీనివాస్, గంగాధర్, రాచకొండ విజయ్, నాయకులు సత్యం, పోచమల్లు గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీ, ఉప సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే




**జగిత్యాల టౌన్/ సమ సమాజం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం ఆడపడుచుల అందించే బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల అర్బన్ మండల మోతే గ్రామంలో ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పంపిణీ చేశారు. అనంతరం కెసిఆర్ స్పోర్ట్స్ కిట్స్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అందచేశారు. అనంతరం నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి మహేష్,సర్పంచ్ స్వప్న రాజేశ్వర రెడ్డి,ఎంపీటీసీ రాజశేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటేష్ ,రైతు బందు సమితి మండల కన్వీనర్ జుంబర్తి శంకర్,సర్పంచులు గంగాధర్,లక్ష్మణ్ రావు,ప్రభాకర్,ఎంపిడిఓ శైలజ రాణి, గంగాధర్, మండల ఉప అధ్యక్షులు తుమ్మ గంగాధర్,మండల యూత్ అధ్యక్షుడు శేఖర్,ఎస్సీ సెల్ అధ్యక్షులు ముత్తు, మాజీ సర్పంచ్ రౌతు గంగాధర్, ఉప సర్పంచ్ మహేష్, బొడ్డు బుచ్చన్న,పిట్ట గంగాధర్, గంగమల్లయ్యా, గ్రామ అధ్యక్షులు చంద్ర మౌళి, యూత్ అధ్యక్షుడు రాజ్ కుమార్, శంకర్, రవి, మల్లేశం, భూమయ్య, రాజేందర్ రెడ్డి,పద్మ పాల్గొన్నారు.

# రాయికల్ మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే.



**జగిత్యాల, సమ సమాజం:** జగిత్యాల నియోజకవర్గం పరిధిలోని రాయికల్ మండలం లో గురువారం జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలం లోని భూపతిపూర్, తాట్ల వాయి గ్రామాల్లో బతుకమ్మ పండుగను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందజేసే బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల్లో ప్రారంభించారు. గ్రామాల్లో కెసిఆర్ స్పోర్ట్స్ కిట్లను క్రీడాకాలకు శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అందజేశారు.అనంతరం సింగరావుపెట్ గ్రామంలో 22 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు.భూపతి పూర్ గ్రామంలో హైస్కూల్లో సైన్స్ ల్యాబ్ , ప్రైమరీ స్కూల్లో అదనపు తరగతి గది ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే భూపతిపూర్ వీరాపూర్ గ్రామాల మధ్య 2 కోట్ల 80 లక్షలతో బిటి రోడ్డుకు భూమి పూజ చేశారు.తాట్లవాయి గ్రామంలో పాక్స్ మందుల గోదాం , ప్రాథమిక పాఠశాల లో 10లక్షల తో నూతన తరగతి గది ,రామాలయం వద్ద నూతనంగా నిర్మించిన రామాలయ కళ్యాణ మండపం, యాదవ సంఘ భవనం ప్రారంభోత్సవం చేసి, ఐదు లక్షల తో మంజూరు చేసిన ఎస్సి కమ్యూనిటీ హాల్,గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.3 లక్షల నిధులతో భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల,గ్రామ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్ నియోజిక వర్గం రామన్నపేట మండలం, నిదాన్ పల్లి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ యువ నాయకుడు కొండ రాఘవేంద్ర గారి జన్మ దిన సందర్భంగా భువనగిరి ఎంపీ కోమటరెడ్డి వెంకటరెడ్డి గారిని కలిసి ఆశీర్వాదం తిస్కోవడం జరిగింది .

## బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన ఎంపీపీ ఉమా మల్లారెడ్డి



**దంతాలపల్లి సమ సమాజం:** మండలం లోని రామచంద్రపురం గ్రామంలో ఎంపీపీ ఉమా మల్లారెడ్డి బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం వచ్చినప్పటినుండి అనేక సంక్షేమ పథకాలు బడుగు బలహీన వర్గాలకు అదే విధంగా కృషి చేశారని అన్నారు. సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం ఒకటో స్థానంలో ఉందని గృహలక్ష్మి ఆసరా పెన్షన్ కళ్యాణ్ లక్ష్మి, రైతుబంధు, రైతు బీమా, దళిత బంధు, బీసీ బందు అనేక పథకాలను అమలు చేసిన ఘనత కెసిఆర్ కి దక్కుతుందని ఆయన అన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రెడ్డి నాయక్ భారీ మెజార్టీతో గెలుపొందుతారని రాష్ట్రంలో మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ అవుతారని చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధర్మారపు నాగయ్య తదితరులు పాల్గొన్నారు. నిదనపురంలో మండలంలోని నీదానాపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ పెండ్యాల నరేష్ బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డ్ నెంబర్ సుధాకర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇటికాల చిరంజీవి సహకారంతో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన కాంగ్రెస్ నాయకులు



**అడ్డగూడూర్ సమ సమాజం:** మండల పరిధిలోని రాపాక(డి) గ్రామంలో ఇటీవల గొలుసుల యాదగిరి యాదవ్ మరణించారు. వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ నాయకులు ఇటికాల చిరంజీవి సహకారంతో బాధిత కుటుంబానికి 5000/-వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు చిప్పలపల్లి పరశురాములు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లింగాల సుధాకర్ రెడ్డి, బొనుగా వెంకటరెడ్డి, గొలుసుల గురుమూర్తి, ముక్కముల నర్సయ్య, చిప్పలపల్లి యాదగిరి, ముక్కామల బిక్షం, సూరారం గోపాల్, స్వామి, చిప్పలపల్లి వెంకన్న, యూత్ నాయకులు బండారు ఉపేందర్, గొలుసుల వెంకన్న, ముక్కామల యాదగిరి, చిప్పలపల్లి మహేష్, సూరారం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షుడు గా నోముల మల్లేష్ యాదవ్

**వలిగొండ సమ సమాజం:**మండల పరిధిలోని రెడ్ల రేపాక గ్రామానికి చెందిన నోముల మల్లేష్ యాదవ్ ని అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షుడు గా ఎన్నుకోవడం జరిగింది. అదేవిధంగా ప్రధాన కార్యదర్శి గా గోపరాజు పల్లి గ్రామానికి చెందిన చిల్లర స్వామి యాదవ్ ని ఉపాధ్యక్షులు గా గుర్నాథ్ పల్లి గ్రామానికి చెందిన ఆవుల నర్సింహ యాదవ్ ను అఖిల భారత యాదవ మహా సభ జిల్లా అధ్యక్షులు చుక్కల సత్యం యాదవ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుండెబోయిన అయోధ్య యాదవ్ జిల్లా ఉపాధ్యక్షుడు దేగల పాండు యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రాలను అంద జేశారు. అలాగే భువనగిరి నియోజకవర్గ అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షులు గా అరూర్ గ్రామానికి చెందిన ఆవుల స్వామి యాదవ్ ని ఉపాధ్యక్షులు గా పహిల్వా ఫన్ పురం గ్రామానికి చెందిన వనగంటి రామాహరి యాదవ్ ని నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహా సభ జిల్లా నాయకులు గంగుల శ్రీనివాస్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ సాంస్కృతిక జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర యాదవ్, నాయకులు జినుకల దానయ్య యాదవ్, గజ్జి ఐలయ్య యాదవ్ లు పాల్గొన్నారు.



## మునుగోడును రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలని మునుగోడులో రాస్తారోకో

**మునుగోడు సమ సమాజం:** నియోజకవర్గ కేంద్రం లోని అంబేద్కర్ చౌరస్తాలో మునుగోడు నియోజకవర్గ కేంద్ర హక్కుల సాధన సమితి జాయింట్ యాక్షన్ కమిటీ అధ్వర్యంలో మునుగోడును రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద యెత్తున నినాదాలు చేశారు..జేఏసీ నాయకులు పాలకూరి నరసింహ్మ గౌడ్, మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలో రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిర్లక్షం తగదన్నారు.నియోజకవర్గ కేంద్ర హక్కుల సాధనకై మండల ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమములో. మునుగోడు సర్పంచ్ మిరియాల వెంకటేశ్వర్లు,మాజీ ఎంపీపీ పోలగొని సత్యం,నన్నూరి విష్ణువర్ధన్ రెడ్డి,పాల్వాయి చెన్నారెడ్డి,జిట్టగొని యాదయ్య,పందుల భాస్కర్,మక్కేన అప్పారావు,సూరిగి నరసింహ గౌడ్,ఎండీ అన్వర్,మేక ప్రదీప్ రెడ్డి,యాసరాని శ్రీను,యసరాని దినేష్,పందుల సురేష్,పందుల హరీష్,పందుల వెంకన్న,తీగల శశి, పులకరం హనుమంత్,బొమ్మగొని అనిల్,స్వామి, రేవెళ్ళి సైదులు, జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గొర్రెల పంపిణీ చేయకపోతే ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

**కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో పోలీసులకు గొల్ల కురుమలకు మధ్య తోపులాట**

**జిఎంపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్**

**మహబూబాబాద్ సమ సమాజం:**రెండో విడత గొర్రెల పంపిణీ చేయకపోతే గొల్ల కురుమలు రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం రెండో విడత గొర్రెల పంపిణీ నీ నగదు బదిలీ ద్వారా అమలు చేయాలని గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం లో పోలీసులకు గొల్ల కురుమలకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. గొర్రెల పెంపకం దారులు అందరూ కలెక్టరేట్ గేట్ల ముందు బైటాయించి నినాదాలు చేశారు. అనంతరం ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిఎంపిఎస్ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడత రవీందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో లక్ష మంది గొల్ల కురుమలు అప్పులు చేసి బంగారం కుదరపెట్టి అధిక వడ్డీలకు తెచ్చి 43,750 రూపాయలు డీడీలు కట్టి గొల్ల కురుమల రాష్ట్రవ్యాప్తంగా సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వ మాత్రం నమ్మకు నీరుతున్నట్టుగా వ్యవహరిస్తుందని ఇలా వివరించడం విడ్డూరమని వారు అన్నారు. నిజంగా గొల్ల కురుమలను ఈ ప్రభుత్వం అభివృద్ధి చేయాలనే ఉద్దేశం ఉంటే ఎన్నికల కోడ్ ముందే సబ్సిడీ డబ్బులు కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులుగా ఉన్న ఎమ్మెల్యేలు మంత్రులు మా పార్టీ కండువా కప్పుకున్న వారికి గొర్రెలు అని తప్పుడు ఆరోపణలు చేయడం సరైనది కాదని, వారు అన్నారు. అధికార పార్టీ నాయకులు ఇలానే వ్యవహరిస్తే రానున్న రోజుల్లో ప్రజాప్రతినిధులను గ్రామాల్లో గొల్ల కురుమలు తిరగనియ్యకుంటా అడ్డుకుంటారని అలాంటి పరిస్థితి తీసుకోవద్దని వారు నాయకులను హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లాలో 5000 మంది డిడిలు కట్టి ఎదురుచూస్తున్నారని వారందరికీ వెంటనే ఇలాంటి అవినీతి జరగకుండా నగదు బదిలీ ద్వారా గొర్రెలు పంపిణీ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ చేయకపోతే ఈసారి టిఆర్ఎస్ ప్రభుత్వం గొల్ల కురుమల ఆగ్రహానికి గురికాక తప్పదని, గద్దె దిగడం ఖాయమని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో రెండో విడత గొర్రెల పంపిణీ వెంటనే పూర్తి చేయాలని, లేనియెడల అక్టోబర్




9వ తేదీన హైదరాబాద్ పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయం ముందు వేలాది మంది గొర్ల గొలుమలతో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని వారు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ డ్రావిడ్ కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి సుధాకర్, మౌబాద్ ఐదవ వార్డు కౌన్సిలర్ కోడి నాగలక్ష్మి శ్రీనివాస్, జిఎంపిఎస్ జిల్లా అధ్యక్షులు పయ్యావుల మల్లయ్య, జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్, సెలగోళ్ల మల్లయ్య, ఇమ్మడి గోవింద్, మెట్ల మోహన్ రావు, చిన్నాల కట్టయ్య, గాడిదల సోమలింగం, ఉడుగుల ఐలయ్య, ఎర్రబోయిన మురళి, రాము, కోడి మురళి, గంద్రకోటి కుమార్, దేవన బోయిన మల్లయ్య, సోనబోయిన లింగయ్య, రఘు యాదవ్, భయ శీను, లింగయ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక నిబంధనలు అతిక్రమించిన షాప్ మూసివేత, జరిమానా!

**తొర్రూరు సమ సమాజం:** ప్రతి నెల 5వ తారీఖు కార్మికుల నిబంధనల ప్రకారం షాపులు బంద్ చేసి మీటింగ్ పెట్టుకునే తరుణంలో ఈ నిబంధనలు అతిక్రమించి రాజు మెకానిక్ షాప్ నిర్వాహకులు షాప్ తెరిచి విధులు నిర్వహిస్తున్న తరుణంలో మండల అధ్యక్షుడు ఎండి పాషా షాప్ బంద్ చేసి షాప్ నిర్వాహకునికి 5000 రూపాయల జరిమానా విధించడం జరిగిందని, నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరు నడుచుకోవాలని నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారినైనా తొలగించడం తప్పదని ప్రగతి టూ వీలర్ మెకానిక్స్ యూనియన్ తొర్రూరు మండల అధ్యక్షుడు ఎండి పాషా తెలిపారు. గురువారం మెకానిక్ వర్కర్స్ యూనియన్ మీటింగ్ ఉన్న సందర్భంగా నిబంధనలు అధిగమించి షాపు తెరిచిన వ్యక్తికి పలుమార్లు ఫోన్ చేసి చెప్పినా కూడా వినకపోవడంతో యూనియన్ సభ్యులు అందరూ వెళ్లి షాప్ బంద్ చేసి జరిమానా విధించామని, ఈ కార్మిక నిబంధనలు అతిక్రమించి విధులు నిర్వహించినందుకు గాను జిల్లా కమిటీ రాష్ట్ర కమిటీ స్పందించి ఇతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొరూరు పరిధిలో మెకానిక్ యూనియన్ సభ్యులు 40 మందికి పైగా ఉండడంతో అందరి సమక్షంలో ఈ నిర్ణయం తీసుకొని తీర్మానం చేయడం జరిగిందని ఆయన తెలిపారు.



యూనియన్ తొర్రూరు మండల కార్యదర్శి తోట శేషు, ప్రసాద్, ఉపాధ్యక్షుడు కే. ప్రసాద్, కోశాధికారి సతీష్, యూనియన్ సభ్యులు బాలరాజ్, కిషన్, నరేష్, హుజూర్, అహ్మద్, శ్రవణ్, నవీన్, మహేష్, సురేష్, ప్రవీణ్, సత్యం సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

**సిద్ధార్థ స్కూల్ యాజమాన్యాన్ని భయ భ్రాంతులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి**

**సిద్ధార్థ స్కూల్ చైర్మన్ ముత్తినేని సోమేశ్వరరావు.**

**తొర్రూరు సమ సమాజం:** రాజకీయంగా నన్ను ఎదుర్కోలేక సిద్ధార్థ స్కూల్ యాజమాన్యం ఐన నేను మా తమ్ముడు కావడం వల్ల.. నేను కాంగ్రెస్ పార్టీ నాయకుడిని కావడంతో నన్ను ఎదుర్కోలేక.. మా తమ్ముడు జయ ప్రకాష్ పై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం సరి కాదని సిద్ధార్థ స్కూల్ చైర్మన్ ముత్తినేని సోమేశ్వరరావు అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని సిద్ధార్థ స్కూల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్కూల్ చైర్మన్ సోమేశ్వర రావు మాట్లాడుతూ గత కొంతకాలంగా నన్ను రాజకీయంగా ఎదుర్కోలేక స్థానిక శాసనసభ్యులు, మంత్రి మా స్కూల్ పై కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనబత్తుల ప్రభాకర్ రావుతో గత కొంతకాలంగా మాకు స్థిరాస్తి గొడవలు జరుగుతున్నాయని ఆ విషయంలో మహబూబాబాద్ జిల్లా కోర్టులో కేసు ఉన్నప్పటికిని అధికార పార్టీ నాయకుల అండదండలతో, రాజకీయ పలుకుబడితో, అధికారుల అండదండలతో కొంతమంది రాజకీయ గుండాలను మధ్యలో పెట్టి తమను తమ స్కూలును ఇబ్బందులకు గురి చేస్తున్నారని దీనికి ప్రభుత్వ శాఖలు కూడా వారికి సహకరిస్తూ మా తమ్ముడు అయినా జయప్రకాష్ ను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు కేసు నడుస్తున్న కూడా మహిళలను పంపించి గోడ నిర్మాణాలను చేపట్టడం ఏమిటి అని ప్రశ్నించారు. మహిళలతో మమ్ములను రెచ్చగొట్టి అక్రమ కేసులు బనాయించేందుకే కుట్రపూరితంగా చేసే ఆలోచనలకు ప్రభుత్వ అధికారులు కూడా వత్తాసు పలకడం ఏమిటని? అధికారులు ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడతారా అధికార పార్టీకి వత్తాసు పలుకుతారా విమర్శించారు. సాక్షాత్తు జిల్లా ఉన్నత అధికారి కే ఫిర్యాదు చేసిన కూడా అన్యాయం చేస్తున్న వారికే అధికార పార్టీకి చెందిన నాయకులు అధికారులు సహకరించడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కోర్టు కేసులో మాత్రం నా పేరు ఉంటుంది కానీ మా తమ్ముని పిలిచి బెదిరించి సంతకాలు చేయించుకున్న పత్రంలో మాత్రం నా సంతకం అవసరం లేదా అని నిలదీశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కోర్టులో ఉన్న కేసులను కోర్టు పరిధిలోనే



పరిష్కారమయ్యేంతవరకు వేచి చూడాలి కాని... అధికార పార్టీ అండదండలతో అధికార దుర్వినియోగం చేస్తూ అమాయకులను బలి చేయడం సరికాదని అన్నారు.


Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in